# రైతులంటే చిన్నచూపెందుకు?

- రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌ది మూర్ఖపు పాలన
- రెండు పంటలైనా రైతు భరోసా ఇవ్వరా?
- కర్షకుల పొట్టకొడితే సహించేది లేదు : నిరంజన్‌రెడ్డి


జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

గద్వాల, అక్టోబర్ 20 : ఆకాశమంత అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా రైతులు, ప్రజలను నిండా ముంచారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలో భాగంగా ఆరు గ్యారెంటీలు, 13 అంశాలు, 420హామీలు చెప్పి నేడు ఏ ఒక్కటీ అమలు చేయడం చేతగాక ఉన్న పథకాలకు రాంరాం పాడుతున్నారని మండిపడ్డారు. వానకాలానికి సంబంధించి రైతుభరోసా ఇవ్వడానికి ప్రభుత్వం వద్ద పైసలు లేవని వ్యవసాయశాఖ మంత్రి రైతులకు చావు కబురు చల్లగా చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ అంటేనే కొర్రీలు పెట్టే మోసకారి పార్టీ అని, ఏనాడూ రైతుల సంక్షేమానికి పాటుపడలేదన్నారు. సాగుచేసే వారికే రైతుభరోసా ఇస్తామని సీఎంతోపాటు మంత్రులు చెబుతున్నారని, ఎవరైనా సేద్యం చేయకుండా భూమిని పడావుగా ఉంచుకుంటారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న 70 లక్షల మందికి రైతుభరోసా ఇవ్వకుండా పొట్టకొట్టడం సరికాదన్నారు. సీఎం, మంత్రుల మాటల వ్యవహార శైలి వల్ల బ్యాంకులు కూడా రాష్ట్రానికి రుణసదుపాయం ఇవ్వని పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందని ఆరోపించారు. స్టాంప్స్ రిజిస్ట్రేషన్ కింద రాష్ట్రానికి రూ.18వేల కోట్ల వరకు ఆదాయం వచ్చేదని, వీరివల్ల ప్రస్తుతం ఘననీయంగా పడిపోయిందన్నారు. ఆరేడు నెలల్లోనే ప్రజలు తిరగబడే పరిస్థితి తెచ్చుకోవడం సిగ్గుచేటన్నారు. 24గంటల కరెంట్, సాగునీళ్లు, రైతుబంధు, ఎరువులు, విత్తనాలు ఎలాంటి కొరత లేకుండా ప్రతి రైతుకు కేసీఆర్ సర్కారు అండగా నిలిచిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో పడావుపడిన పొలాలన్నీ బీఆర్ఎస్ సర్కారులో పచ్చదనాన్ని సంతరించుకునేలా తీర్చిదిద్దామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతగాక రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్, జిల్లా నాయకులు బాసు హన్మంతునాయుడు, బీచుపల్లి, మోనేశ్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

# రైతు భరోసా ఇచ్చేదాకా వదలం

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- మక్తల్ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నేతల ఆందోళన

మక్తల్, అక్టోబర్ 20 : రైతుభరోసా ఇచ్చేదాకా కాంగ్రెస్ పార్టీని వదిలేది లేదని, వారికి అందాల్సిన సాయాన్ని రేవంత్‌రెడ్డి ఢిల్లీ గులాంలకు ముట్టచెబుతున్నారని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. రైతుభరోసా ఇవ్వలేమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి-167పై రైతులు, నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చిట్టెం మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణలో వ్యవసాయరంగాన్ని తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పండుగలా మార్చి రైతును రాజు చేశారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం తాగడానికి కూడా నీళ్లవ్వలేని చేతగానితనాన్ని మూటగట్టుకుందన్నారు. 24గంటల కరెంట్, ఠంచన్‌గా ఏడాదికి రెండు పంటలకు పెట్టుబడి సాయం అందించడంతోపాటు పెండింగ్ ప్రాజెక్టులు చేపట్టి బీఆర్ఎస్ రైతులకు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అమలుకు సాధ్యంకాని 420 హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రెండు పంటలు పూర్తికావొస్తున్నా రైతులకు ఇప్పటికీ రూపాయి కూడా రైతుభరోసా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికి అసలుకే ఎసురు పెట్టేలా మంత్రి వ్యాఖ్యలు చేయడం రైతులకు కాంగ్రెస్ ఏపాటి ప్రాధాన్యత ఇస్తుందో ఇట్టే తెలిసిపోతుందన్నారు. రైతు భరోసా ఇచ్చే వరకు ప్రభుత్వాన్ని వదిలేది లేదని, రైతులకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. రైతుబంధు డబ్బులను రేవంత్‌రెడ్డి తన సీఎం కుర్చీ కాపాడుకునేందుకు ఢిల్లీ గులాంలకు అప్పజెప్పి రైతుల నోట్లో మట్టికొడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గుప్తా, రాజుల ఆశిరెడ్డి, ఎల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజేశ్‌గౌడ్, చిన్న హన్మంతు, గాల్‌రెడ్డి, కుర్మయ్య, శంకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అన్వర్ హుస్సేన్, మారుతిగౌడ్, రవికుమార్, ఈశ్వర్‌యాదవ్, కృష్ణ, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





మహబూబ్‌నగర్ మండలం కోడూర్ గ్రామంలో నిర్వహించిన ధర్నాలో నిరసన తెలుపుతున్న గులాబీ నేతలు


జడ్చర్లలో బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

# నిప్పులు కక్కిన కర్షకలోకం

## రైతుభరోసాకు ఎగనామం పెట్టిన సర్కారుపై కన్నెర్ర

గట్టులో బీఆర్ఎస్ నాయకుల చేతిలో నుంచి దిష్టిబొమ్మను లాక్కెళ్తున్న పోలీసులు


పెబ్బేరులో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిరసనల హోరు
- రైతుభరోసా ఎగవేతపై భగ్గుమన్న బీఆర్ఎస్ నేతలు, కర్షకులు
- రేవంత్‌రెడ్డి, సర్కార్ దిష్టిబొమ్మల దహనం
- పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందేనని డిమాండ్
- చేతగాకుంటే సీఎం కుర్చీ దిగిపోవాలని నినాదాలు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రైతులను నిలువునా మోసం చేస్తూ రేవంత్ సర్కారు రైతుభరోసా ఇవ్వలేమని వ్యవసాయశాఖ మంత్రి ప్రకటించడంపై ఆదివారం ఉమ్మడి జిల్లాలో ఆందోళనలు పెల్లుబికాయి. బీఆర్ఎస్ నేతలు, రైతులు, ప్రజా సంఘాలు కాంగ్రెస్ సర్కారు తీరును తప్పుబడుతూ దుమ్మెత్తిపోశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ధర్నాలు, రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యారు. ఉదయం 11గంటలకు రోడ్డుపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. మండల కేంద్రాల్లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఎన్నికల సమయంలో రైతుభరోసా కింద ఏడాదికి రూ.15వేలు ఇస్తామని ప్రకటించి అసలుకే ఎసరు పెట్టారని మండిపడ్డారు. యాసంగిలో ఇస్తామన్న రైతుభరోసా ఇప్పటివరకు అడ్రస్ లేకపోగా, వానకాలానికి సంబంధించి ఇక ఇవ్వలేమని మంత్రి ప్రకటన చేయడం సిగ్గుచేటన్నారు. రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా ఇవ్వకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


చిన్నచింతకుంట మండలం పర్దీపూర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**కదిలొచ్చిన రైతాంగం..**

రైతుభరోసా ఇవ్వలేమని కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమానికి రైతులు కదిలొచ్చారు. రేవంత్‌రెడ్డి సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనలో పాల్గొన్నారు. పదేండ్లు వ్యవసాయాన్ని కేసీఆర్ సారు పండుగలా మార్చగా, కాంగ్రెస్ వచ్చి ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. వెంటనే రెండు పంటలకు సంబంధించి పెట్టుబడి సాయం అందించాలని, లేదంటే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగా, బీఆర్ఎస్ చేపట్టిన నిరసనకు అక్కడక్కడా పోలీసులు అడ్డంకులు సృష్టించారు.

**మోసకారి ప్రభుత్వం..**

కేసీఆర్ సారు రైతును రాజును చేస్తే కాంగ్రెస్ సర్కారు రోడ్డున పడేస్తున్నది. మేం గెలిస్తే రైతు భరోసా ఏడాదికి రూ.15వేలు ఇస్తామని ఎన్నికల్లో ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి రెండు పంటలైనా ఎందుకు ఇస్తలేరు. కాంగ్రెస్ అంటేనే కర్షకులకు కష్టాలే తెచ్చే పార్టీ. మొదటి నుంచైనా ఆ పార్టీ తీరే అంత. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని ఎవరిని ఉద్ధరించారు. బస్సులు లేక ప్రయాణికులు ఎన్నో అవస్థలు పడుతున్నారు. రైతులను మోసం చేసే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవు.

*- సువర్ణ, మహిళా రైతు, ధన్వాడ*


ధన్వాడలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న మహిళా రైతు సువర్ణ


జడ్చర్లలో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, బీఆర్ఎస్ శ్రేణులు


కోడూరులో నినదిస్తున్న రైతులు


ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

# రేవంత్‌ది సవితి తల్లి ప్రేమ

- కర్షకులను మోసం చేస్తే సహించేది లేదు
- సొంతూరికేమో సోలార్.. కొడంగల్‌కు పొల్యూషన్ ప్రాజెక్టు
- బూతుల ముఖ్యమంత్రికి రైతుల గోడు పడుతుందా? : పట్నం

మద్దూర్ (కొత్తపల్లి), అక్టోబర్ 20 : దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా మాట్లాడని బూతులతో సీఎం రేవంత్‌రెడ్డి రికార్డ్ నెలకొల్పారని, దేశానికి అన్నం పెట్టే రైతును హీనంగా చూస్తున్నారని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మద్దూర్ మండల కేంద్రంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో కాంగ్రెస్ రైతుభరోసా ఎగవేతపై బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ రూ.10వేలు రైతుబంధు ఇస్తే మేం అధికారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికి నేడు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటన్నారు. రైతులంటే రేవంత్‌కు ఎందుకింత చిన్నచూపని ప్రశ్నించారు. ఢిల్లీ పెద్దలకు దోచిపెట్టేందుకు రైతుల కడుపు కొడితే తగిన బుద్ధి చెబుతారన్నారు. సొంత ఊరికేమో సోలార్ పైలట్ ప్రాజెక్ట్, ఎమ్మెల్యేగా గెలిపించిన కొడంగల్ నియోజకవర్గానికి మాత్రం పొల్యూషన్ ప్రాజెక్ట్ తెచ్చి ప్రజలను నిలువునా మోసం చేశారని మండిపడ్డారు. ఇక్కడి ప్రజలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. దీపావళిలోగా రుణమాఫీ పూర్తితోపాటు రూ.4వేల పింఛన్, ఆడపడుచులకు రూ.2,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మద్దూరు, కొత్తపల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షులు గోపాల్, మధుసూదన్‌రెడ్డి, నాయకులు సలీం, వీరారెడ్డి, బసిరెడ్డి, మహిపాల్ గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, రాములు, బాలచందర్ గౌడ్, చారి పాల్గొన్నారు.


పాన్‌గల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

# సర్కార్‌కు గుణపాఠం తప్పదు

- కాంగ్రెస్ అంటేనే బోగస్ పార్టీ : మాజీ ఎమ్మెల్యే బీరం

పాన్‌గల్, అక్టోబర్ 20 : కాంగ్రెస్ అంటేనే బోగస్ అని, రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. వానకాలం పంటకు రైతుభరోసా ఇవ్వలేమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం మండలకేంద్రంలో రైతులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆందోళన చేపట్టి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీరం మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మూసీనది పేరుతో దోపిడీకి కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. రైతుభరోసా ఇవ్వలేమని రైతుల నోట్లో మట్టికొట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాంరాం చెబుతారన్న కేసీఆర్ మాటలను అక్షరాల నిజం చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో అడ్డగోలుగా హామీలిచ్చి నేడు నెరవేర్చడం చేతగాక ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. అన్ని పంటలకు బోనస్ ఇవ్వాల్సిందేనని, రైతుభరోసా ఇచ్చే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత రంగినేని అభిలాష్‌రావు, మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌నాయక్, వెంకటయ్య నాయుడు, రాజేశ్వర్‌రెడ్డి, వీరసాగర్, తిరుపతయ్య, నవీన్‌రెడ్డి, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# అమరులకు సెల్యూట్

- ఉమ్మడి జిల్లాలో 39 మంది త్యాగమూర్తులు
- కలిచి వేసిన ఎస్పీ పరదేశి నాయుడు మృతి
- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

మహబూబ్‌నగర్, అక్టోబర్ 20 : ప్రజల రక్షణ కోసం ప్రాణాలను లెక్కచేయకుండా శాంతి భద్రతలను కాపాడాలన్నా.. అసాంఘిక శక్తుల ఆట కట్టించాలన్నా.. మొదటి వరుసలో ఉండేవాడు పోలీసు. విధి నిర్వహణలో ప్రాణాలు లెక్క చేయక పోరాడి ప్రాణాలు వదిలిన వీరులకు వందనం, అభివందనం. 1959 అక్టోబరు 21న జమ్మూకాశ్మీర్ లేహ్ ప్రాంతంలో మైనస్ 35 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మనషులు గడ్డకట్టే ఆ చలిలో సైతం భారత జవాన్లు సరిహద్దు గస్తీలో ఉన్నారు. అంతలో చైనా సైనికులు అకస్మాత్తుగా దాడి చేశారు. ఈ భీకర దాడిలో భారత జవాన్లు 11 మంది దుర్మరణం చెందారు. కొంతమంది చైనా సరిహద్దులో మృతిచెందగా, మరికొంత మంది అసువులు బాశారు. మృతదేహాలను సైతం సొంత ప్రాంతానికి తీసుకురాలేని పరిస్థితి. భారత ప్రభుత్వం మృతదేహాలను అక్కడే ఖననం చేయాలని నిర్ణయించింది. కుటుంబ సభ్యులు తమ వారిని కడసారి కూడా చూసుకోలేకపోయారు. ఆ సైనికుల ఆత్మకు శాంతికలగాలని ప్రతి ఏడాది అక్టోబర్ 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకొంటున్నారు. లేహ్ ప్రాంతంలో అమరవీరుల సంస్మరణ స్థూపం నిర్మించారు.

**ఉమ్మడి జిల్లాలో పోలీసు అమరవీరులు..**

జిల్లాలో మావోయిస్టు తూటాలకు ఇంతవరకు 39 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. వారి వీరత్వాన్ని గుర్తుచేస్తూ ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరువీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. రక్తదాన శిబిరం, ఓపెన్ హౌజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 39 మంది పోలీసులు అమరులయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోనే 30 మంది తూటాలకు, ల్యాండ్‌మైన్లకు బలవగా, మరో ఇద్దరు జిల్లా నుంచి విడిపోయిన సైబరాబాద్ పరిధిలోకి వెళ్లారు. ఎస్పీ పరదేశినాయుడు సంఘవిద్రోహుల చేతిలో చనిపోవడం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సోమశిల వద్ద పరదేశినాయుడు తమ సిబ్బందితో కలిసి వెళ్తున్న సమయంలో మావోయిస్టులు మందుపాతర పేల్చారు. ఈ దుర్ఘటనలో ఎస్పీతో పాటు ఇద్దరు ఎస్సైలు కిశోర్ కుమార్, శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ రంగారెడ్డి, కానిస్టేబుళ్లు సుభాన్, జహబ్ ఇక్బాల్, జయరాం, వైవీఎస్ ప్రసాద్ అక్కడిక్కడే మృతిచెందారు. పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా పరిధిలోని ఐదు జిల్లాల్లో సోమవారం ఉదయం 8:45 గంటలకు పోలీసు అమరులకు నివాళులర్పించనున్నారు. ఆయా జిల్లాల ఎస్పీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నివాళి అనంతరం పోలీసులు ఎస్పీ కార్యాలయం నుంచి వన్‌టౌన్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టనున్నారు. కాగా, పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నారు.


ఎస్పీ పరదేశి నాయుడి విగ్రహం

# డీఎల్ఐ కాల్వ పనుల్లో బ్లాస్టింగ్

- యువకుడికి తీవ్ర గాయాలు

వంగూరు, అక్టోబర్ 20 : డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మండలంలోని నర్సంపల్లి శివారులో ఇష్టానుసారంగా బ్లాస్టింగ్ చేపట్టడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. శనివారం సాయంత్రం నర్సంపల్లి సమీపంలోని డీఎల్ఐ కాల్వ పనుల్లో చేపట్టిన బ్లాస్టింగ్ వల్ల డేరంగుల శ్రీను కుమారుడు రుస్తేజ్ పొలంలో ఉండగా రాయి తగలడంతో చెయ్యి విరిగింది. దీంతో అతడిని హుటాహుటిన ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సదరు కంపెనీ సిబ్బంది బ్లాస్టింగ్ సమయంలో చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయకపోవడంతో యువకుడికి గాయాలైనట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేలుళ్ల సమయంలో ప్రజలకు సమాచారమిచ్చి అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉన్నది.




